
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు

జిల్లా వార్తలు

5

సోమవారం 16 డిసెంబరు 2024

త్యాగధనుడు పొట్టి శ్రీరాములు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది అని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. మద్రాసులో 1952 అక్టోబరు 19న నిరాహారదీక్ష ప్రారంభించారనీ, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనలో 1952 డిసెంబరు 15న మహనీయుడు అసువులుబాసినట్లు తెలిపారు.



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, బీసీ సంక్షేమ అధికారిణి వెంకటలక్ష్మి జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, కలెక్టర్ కార్యాలయం ఏవో విజయశ్రీ పాల్గొన్నారు.

- కర్నూలు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)

మన మార్కెట్లో మహారాష్ట్ర ఉల్లి

కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులను నిషేధించడంతో దేశంలోనే ఉల్లి ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్న మహారాష్ట్ర రైతులు దేశంలోనే వివిధ రాష్ట్రాల్లో ఉల్లిని ఎగుమతులు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉల్లిని సాగు చేస్తున్న రైతుల పరిస్థితి దారుణంగా మారింది. గత వారం కర్నూలు మార్కెట్ యార్డులో రూ.4,500 దాకా క్వింటం ఉల్లి ధర అందుకున్న రైతులు తాజాగా గరిష్ఠంగా రూ.3,500 అందుకున్నారు. ఓ వైపు తెగుళ్లు, ఇంకో వైపు ధర పతనంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజుల నుంచి మహారాష్ట్ర నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు ఉల్లి దిగుమతి మొదలైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి సరఫరా కూడా తక్కువైంది. అయినా గిట్టుబాటు ధర లభించక ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు.

-కర్నూలు అగ్రికల్చర్ (ఆంధ్రజ్యోతి)



మహారాష్ట్ర నుంచి వచ్చిన ఉల్లి



కర్నూలు నగర శివారులో ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ వద్ద అసంపూర్తిగా పేదల ఇళ్లు

గూడు.. గోడు...!

- వైసీపీ హయాంలో అంతులేని నిర్లక్ష్యం
- గాల్లో దీపంలా పేదల సొంతింటి కల
- రూ.52 కోట్ల బిల్లులను క్లియర్ చేసిన కూటమి ప్రభుత్వం
- పక్కా గృహాలపై దృష్టి సారించిన చంద్రబాబు
- నెలాఖరులో 4,422 గృహాల టార్గెట్

జగనన్న కాలనీల పేరిట అప్పట్లో పెద్ద కలరింగ్ ఇచ్చిన వైసీపీ పాపం నేటికీ పేదలను వెంటాడుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా పక్కా ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి తర్వాత అతీగతీ లేకుండా చేశారు. నాటి అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ఫలితంగా నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. పలు గ్రామాల్లో పునాదులు కూడా తీయలేదు. ప్రచార ఆర్భాటం తప్ప పురోగతి లేకుండాపోయింది. ఆర్నెల్ల క్రితం ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించింది. 2014-19 మధ్యలో ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణం పథకం కింద గృహాలు నిర్మించుకున్న పేదలకు ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా మొండి చేయి చూపింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే ఆ బిల్లులకు మోక్షం కల్పించారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన రూ.52 కోట్లకు పైగా బిల్లులు బకాయిలు చెల్లించింది. ఈ ఏడాది ఆఖరులోగా అసంపూర్తిగా ఉన్న మరో 4,422 ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులకు టార్గెట్‌ను నిర్దేశించారు. జిల్లాలో పేదల ఇళ్ల పురోగతిపై ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయి పరిశీలన కథనం.





కర్నూలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం నియోజకవర్గాల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకంలో 53,248 పక్కా గృహాలు మంజూరు చేశారు. 2024 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంగా 2021 జూన్‌లో మెగా గ్రౌండింగ్ మేళాను చేపట్టారు. ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణలో పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. నాటి వైసీపీ పాలకుల నిర్లక్ష్యం ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం నిరీక్షిస్తున్న పేదలకు శాపమైంది. 19,500 ఇళ్లను కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేకపోయారు. నిర్మాణమైన గృహాల బిల్లులు రూ.52 కోట్లు బకాయి పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బకాయిలను చెల్లించింది. నిజానికి 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తయిన ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ స్కీంలో నిర్మించిన ఇళ్లకు జగన్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేసింది. లబ్ధిదారులంతా టీడీపీ సానుభూతిపరులని ముద్ర వేసి వారికి బిల్లులను నిలిపివేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 2,500 మందికిపైగా లబ్ధిదారులకు బిల్లులను క్లియర్ చేసింది.

గత ప్రభుత్వంలో 53,248 పేదలకు ఇళ్లు మంజూరు చేస్తే 39,408 ఇళ్లను మాత్రమే నిర్మాణాలు (గ్రౌండ్) చేపట్టారు. అందులో 19,577 ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారు. 13,840 ఇళ్ల పునాదులు కూడా తీయలేదు. వివిధ దశల్లో ఆగిపోయిన 19,831 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అప్పగించాలనే ప్రణాళిక సిద్ధం చేశారు. అధికారులకు లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు.

ఈ నెలాఖరులోగా 4,422 ఇళ్లు లక్ష్యం

జిల్లాలో గత ప్రభుత్వంలో చేపట్టి వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న 19,831 ఇళ్లలో పైకప్పు (రూఫ్‌కాస్ట్) వేసి అసంపూర్తిగా ఉన్న 4,422 ఇళ్లను ఈ నెలాఖరులోగా అన్ని దశల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన ఇళ్లను కూడా గడువులోగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి, జిల్లా అధికారులు, సిబ్బంది కష్టపడుతున్నారు.

ఆ గృహాల నాణ్యత ప్రశ్నార్థకమేనా..?

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆప్షన్-3 కింద ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తామని ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో 10,138 ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఆదోనిలో 4,970 ఇళ్ల నిర్మాణాలను బోయిళ్ల కన్‌స్ట్రక్షన్ సంస్థ చేపట్టింది. ఎమ్మిగనూరు రూరల్‌లో 125, పట్టణంలో 1,022, మంత్రాలయంలో 297 ఇళ్లను బోయిళ్ల సంస్థ కాంట్రాక్ట్ తీసుకుంది. ఈ రోజుకు ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదు. ఆలూరులో ఆర్టా వెంచర్స్ సంస్థ 309 ఇళ్లను కాంట్రాక్ట్ తీసుకొని నిర్మాణాలు చేపట్టారు. ఆప్షన్-3 కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు మాత్రం ఇప్పటి వరకు రూ.77 కోట్లకుపైగా బిల్లులు చెల్లించారు. అయితే వారు ఒక్క ఇంటిని కూడా పూర్తి చేయకపోవడం కొసమెరుపు. పైగా ఆ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లతో తనిఖీ చేయించాలని పలువురు కోరుతున్నారు.





ఆదోని పట్టణ శివారులో పేదల ఇళ్ల దుస్థితి ఇలా

గడువులోగా పూర్తి చేస్తాం



గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న పేదల ఇళ్లలో ఈ నెలాఖరులోగా 4,422 ఇళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. ఇప్పటికే 1,585 ఇళ్లను పూర్తి చేశాం. గడువులోగా మిగిలిన ఇళ్లను అన్నిదశల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం. పేదల ఇళ్ల నిర్మాణం పురోగతిపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా రోజు సమీక్షిస్తున్నారు. బిల్లులు బకాయిలు లేవు. కూటమి ప్రభుత్వ రాగానే బకాయిలు చెల్లించింది. పీఎఫ్‌ఎంఎస్ ఖాతాలకు 49 మంది లబ్ధిదారులు ఆధార్ లింక్ కాకపోవడంతో వారికి మాత్రమే రూ.49 లక్షలు బకాయి ఉంది. అది కూడా ఆధార్ లింక్ చేసి త్వరలోనే చెల్లిస్తాం.

- చిరంజీవి, ప్రాజెక్ట్ డైరెక్టర్, గృహ నిర్మాణ శాఖ, కర్నూలు

పేదల ఇళ్ల నిర్మాణాల పురోగతి ఇలా

డివిజన్లు	మంజూరైనవి	మొదలు కానివి	మొదలైనవి	పూర్తి చేసినవి
ఆదోని	10,362	8,005	2,357	1,852
ఆలూరు	4,817	4,577	240	2,131
ఎమ్మిగనూరు	6,659	5,336	1,323	2,617
మంత్రాలయం	6,951	6,950	01	3,435
పత్తికొండ	6,302	6,110	192	3,504
కర్నూలు అర్బన్	15,017	6,384	8,633	4,483
కోడుమూరు	3,140	2,046	1,094	1,555
మొత్తం	53,248	39,408	13,840	19,577

పోలీసుల పహారాలో కపటి

- సెట్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సీరియస్
- నిందితులపై చట్టపరమైన చర్యలకు ఆదేశం

ఆదోని రూరల్, డిసెంబరు 15 : ఆదోని మండలం కపటిలో పోలీసులు పహారా కాస్తున్నారు. శనివారం రాత్రి బీజేపీ నాయకుడు ఈరన్న కుటుంబంపై ఆ పార్టీ నాయకులే కారం చల్లి మారణాయుధాలతో దాడి చేయడంపై ఎస్పీ బిందు మాధవ్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివారం సెట్ కాన్ఫరెన్స్‌లో డీఎస్పీ సోమన్నకు ఎస్పీ ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈరన్న కుటుంబంపై దాడి ఘటనలో గ్రామానికి చెందిన బోయ ఈరమ్మ, వెంకటేశులు, వెంకటస్వామి, గోవింద రాజులు, రవి, తిరుమల, వీరేష్ గిడ్డయ్యలపై బీఎన్‌ఎస్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా, రూరల్ సీఐ నల్లప్ప, ఎస్ఐ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రస్తుతం చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఈరన్న కర్నూలులో, ఆయన భార్య రాధమ్మ, ఇద్దరు బిడ్డలు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



బందోబస్తు నిర్వహిస్తున్న ఇస్వీ పోలీసులు

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

స్వామి, అమ్మవార్ల దర్శనానికి నాలుగు గంటల సమయం



క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. భారీగా భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. దీంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి నాలుగు గంటలకుపైగా సమయం పట్టింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలను జరిపారు. కాగా సాయంత్రం స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. నిత్యకళారాధనలో భాగంగా నెల్లూరు జిల్లా వేంకటేశర ఆర్ట్స్ అకాడమీ బృందం నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకస్తుతి, శివతాండవస్తోత్రం, అయిగిరినందిని, అర్ధనారీశ్వరస్తోత్రం తదితర శైవ గీతాలకు చిన్నారులు మీనాక్షి, శైలజ, తన్మయి, జ్యోత్స్నశ్రీ, దేదీప్రసంతి, జాగృతి, మనస్వి, జ్యోష్ణ, మాన్విత, కనిష్కరెడ్డి, సోమకార్తిక, ప్రసన్న, ధాత్రిలక్ష్మి మోక్షిత తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

అలనాటి తలపులు

- నవోదయలో పూర్వ విద్యార్థుల కలయిక
- జ్ఞాపకలను నెమరువేసుకున్న స్నేహితులు



పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన స్నేహితులు

వివరాలు 7లో

భక్తిపాశం.. ధనుర్మాసం..

- నేటి నుంచి ఆరంభం
- వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక వేడుకలు



గుత్తి రోడ్డులోని సూర్యదేవాలయం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందడి ముగిసింది. మార్గశిరం మొదలైంది. సోమవారం నుంచి విష్ణు భగవానుడికి అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసం ప్రారంభం కానుంది. సూర్యభగవానుడు ధనుస్సురాశిలో ప్రవేశించి మకరసంక్రమణం వరకూ ఆ రాశిలో ఉండే కాలాన్ని ధనుర్మాసం అంటారు. మార్గశిర మాసంలోనే ధనుర్మాసం కొనసాగుతుంది. అందుకే ఈ మాసం విష్ణుమూర్తితో పాటు సూర్యభగవానుడికి కూడా ప్రీతికరం. ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. నెల రోజుల పాటు వైష్ణవ క్షేత్రాల్లో రోజూ మహావిష్ణువుకు ప్రత్యేక పూజలు, తిరుప్పావై పఠనం, గోదా కల్యాణం వంటి వేడుకలు జరగనున్నాయి. ధనుర్మాసం ఆరంభంతోనే అటు పల్లె సీమల్లో సంక్రాతి వేడుకల ఆగమన సందడి కూడా కనిపిస్తుంది. తమ ఇంటి లోగిళ్లను అందంగా ముగ్గులతో తీర్చిదిద్దేందుకు మహిళలు పోటీ పడుతుంటారు. హరిదాసులు, గంగిరెద్దుల ఆటగాళ్లు, జంగమదేవరలు గ్రామాల్లో తిరుగుతూ కనిపిస్తారు. ధార్మిక భావాలకు, ప్రకృతి సంపదలకు నిలయంగా నిలిచే ఈ మాసంలోనే 'సంక్రాంతి' పండుగ కూడా వస్తుంది. నగర శివారులో మామిదాలపాడులోగల గోదా గోకులం (గోదా రంగనాథస్వామి దేవస్థానం)లో సోమవారం నుంచి 2025 జనవరి 19 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఆరంభమవుతాయని గోదా రంగనాథ రామానుజ కూటమి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు.



గోదా గోకుల క్షేత్రంలో కొలువుదీరిన రంగనాథ స్వామి వారు

సంక్రాంతి ఆరంభానికి సంకేతం ధనుర్మాసం

ధనుస్సు అనే పదానికి ధర్మం అని అర్థం. అంటే ఈ ధనుర్మాసంలో ధర్మాన్ని ఎంతగా ఆచరిస్తే అంతగా శ్రీమహా విష్ణువుకు పాత్రులు అవుతారని పండితులు చెబుతారు. ధనుర్మాసం మార్గశిరంలో వస్తుంది. ధనుర్మాసానికి అధ్యురాలు గోదాదేవి. 'గో' అంటే జ్ఞానము అని, 'దా' అంటే అర్థం ఇవ్వడం అని భావన. గోదాదేవి చెప్పిన పాసురాలు ధనుర్మాసంలో విష్ణాలయాల్లో తప్పనిసరిగా గానం చేస్తారు. ధనుర్మాసం ఆరంభాన్నే గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి నెల పట్టడం అంటారు.

వర్చువల్ క్లాస్‌రూమ్‌ల పరిశీలన


అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లో ఉన్న మున్సిపల్ బిల్డింగ్‌లో వర్చువల్ క్లాస్ రూమ్ ఏర్పాటును కలెక్టర్ పి. రంజిత్ బాషా పరిశీలించారు. ఆదివారం సంకల్‌బాగ్‌లో ఉన్న మున్సిపాల్ బిల్డింగ్‌లో వర్చువల్ క్లాస్ రూమ్ ఏర్పాటు భవనాన్ని డీఈవో శామ్యూల్ పాల్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వర్చువల్ క్లాస్ రూమ్ చిన్నగా ఉండటంతో విశాలమైన భవనంలో ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో నగరంలోని సంకల్‌బాగ్‌లో ఉన్న మున్సిపల్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వర్చువల్ తరగతులు నిర్వహించేందుకు స్టూడియో ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ తుంగభద్ర నదీ తీర ప్రాంతాన్ని పరిశీలించారు.

హంద్రీ నీవా నీరు ఎప్పుడిస్తారు..?

- కాలువ ద్వారా 80వేల ఎకరాలకు సాగు
- రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగన్నాథం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో హంద్రీ నీవా కాలువ ద్వారా 80వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించి 12 సంవత్సరాలైనా అమలు చేయడం లేదని సీపీఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో.. ప్రస్తుతం హంద్రీ నీవా కాలువ ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేవలం 20వేల నుంచి 30వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిస్తున్నారని అన్నారు. కాలువ నీటి కోసం మోటార్లు ఏర్పాటు చేసుకుని రైతులు భారీగా డబ్బు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవనకొండ మండలంలోని 40వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా.. కేవలం 15వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దేవనకొండ మండలంలో పంటల కాలువలను త్వరితగతిన పూర్తి చేయాలని, పందికోన రిజర్వాయర్ రివిట్మెంట్‌ను పూర్తి చేయాలని కోరారు.

కష్టాల్లో ఉన్న రైతుల్ని ఆదుకోండి

- ఉచిత పంటల బీమాను అమలు చేయండి
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రైతులు ఏటా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతూ వలస బాటపడుతున్నారని, ఇలాంటి రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీకి మాత్రమే ఉచిత పంటల బీమాను అమలు చేసి ఖరీఫ్‌లో మాత్రమే ఉచిత పంటల బీమాను అమలు చేసి, రబీలో బీమా పథకంలో లబ్ధి పొందాలంటే ప్రీమియం రైతులే చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని మార్చుకుని ఉచిత పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15 వరకే ముఖ్యమైన పంటలకు ప్రీమియం చెల్లించే గడువును నిర్ణయించడం దారుణమని, వరితో పాటు మిగిలిన పంటలకు ఈ నెల 31 వరకు ప్రీమియం చెల్లింపు గడువును పొడిగించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతకొమ్మదిన్నె గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన బాబుషా తన ద్విచక్ర వాహనంపై చాగలమర్రి వైపు వెళ్తుండగా కర్నూలు నుంచి కడప వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాబుషా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు తెలిపారు.

బోరు పైపును ధ్వంసం చేసిన దుండగులు


ధ్వంసమైన బోరు పైపు

కోడుమూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో టీడీపీ కార్యకర్త అయ్యన్న పొలంలో బోరు పైపును గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశానని అన్నాడు. శనివారం సాయంత్రం వరకు మొక్కజొన్నకు తడి పెట్టానని చెప్పాడు. మరలా ఆదివారం ఉదయాన్నే మిగిలిన పొలానికి తడి పెట్టడానికి వెళ్లగా బోరు పైపు, విద్యుత్ వైర్లు ధ్వంసమై ఉన్నాయని తెలిపాడు. దుండగుల దుశ్చర్యతో 7 హెచ్‌పీ మోటారు, 50 పైపులు, విద్యుత్ వైరు బోరులోకి జారిపోయాయని కన్నీటిపర్యంతమయ్యాడు. వీటి విలువ సుమారు రూ.1.8 లక్షలు ఉంటుందని వాపోయాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాహనం ఢీకొని బాలుడు మృతి


మదన అశోక్ (ఫైల్)

బనగానపల్లె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని నందివర్గం పోలీసుస్టేషన్ పరిధిలోని రామతీర్థం గ్రామంలో ఏపీ 39 టీ 0766 బొలెరో క్యాంపర్ వాహనం ఢీ కొనడంతో రామతీర్థం గ్రామానికి చెందిన మర్రి మదన్‌గోపాల్ చిన్నకుమారుడు మదన అశోక్ (14) తలపై తీవ్రగాయాలై మృతి చెందినట్లు నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. పాణ్యం మండలం కందకాయపల్లె గ్రామానికి చెందిన కానాలనాగన్న అనే డ్రైవర్ బొలెరో క్యాంపర్ వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి గ్రామంలోని మలుపు వద్ద నిలబడి ఉన్న అశోక్‌ను ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ఘటనలో అశోక్ తల వద్ద కణతకు తీవ్ర గాయాలు కావడంతో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకుపోగా అక్కడ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి మదన్‌గోపాల్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ కానాల నాగన్నపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలనాటి తలపులు

- నవోదయలో పూర్వ విద్యార్థుల కలయిక
- చిన్ననాటి జ్ఞాపకలను నెమరు వేసుకున్న స్నేహితులు


ఆలింగనం చేసుకుంటున్న పూర్వ విద్యార్థులు


గురువులకు నమస్కరిస్తున్న పూర్వపు విద్యార్థులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పదేళ్లకిందటి మిత్రులు మళ్లీ కలుసుకున్నారు. ఎక్కడెక్కడో, ఏ హోదాల్లోనో ఉన్న వాళ్లంతా బాల్యంలోకి వెళ్లి ఆనాటి జ్ఞాపకాలను తలపోసుకున్నారు. ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దాదాపు పదేళ్ల తర్వాత వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో ఉన్న వందలాది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థులతో కళకళలాడింది. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకోవడంతో భావోద్వేగాలకు లోనయ్యారు. గురువులను శాలువాలు, పూలమాలలు, మెమెంటోలు ఇచ్చి సన్మానించారు. తాము చిన్నతనంలో చేసిన అల్లరిని తలచుకొని నవ్వుకున్నారు. దాదాపు 1500 మందికి పైగా పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి తరలిరావడంతో జవహర్ నవోదయ విద్యాలయం కళకళలాడింది.

నాయకత్వ లక్షణాలను విద్యాలయం నేర్పింది



నవోదయ విద్యాలయంలో చదువుకున్న మా మిత్రులు వివిధ హోదాల్లో దేశంలోనేకాక ఆయా దేశాల్లో కూడా స్థిరపడ్డారు. ఈ విద్యాలయం నాకు నాయకత్వ లక్షణాలను నేర్పించింది. నేను ఈరోజు ఒక జాతీయ రాజకీయ పార్టీలో ఒక నియోజకవర్గ నాయకుడిగా ఎదిగాను. నవోదయ విద్యాలయం క్రమ శిక్షణే దీనికి కారణం.

క్రాంతి నాయుడు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, పత్తికొండ

మాటల్లో చెప్పలేకపోతున్నా



మా సొంత ఊరు కర్నూలు. నేను హైదరాబాదులోని ఓ వైద్యశాలలో పనిచేస్తున్నాను. మా మిత్రులను కలుసుకున్న ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్నాం. ఇక్కడ ఉన్న క్రమశిక్షణే మమ్మల్ని ఈ స్థాయిలో నిలిపింది.

-శిరీష కుమారి, ప్రముఖ వైద్యురాలు, హైదరాబాదు

నేను ఈ స్థాయిలో ఉండడానికి ఈ విద్యాలయమే కారణం:



మాది పక్కనే ఉన్న ఆదోని పట్టణం. నేను 1993 నుంచి 2000 వరకు ఈ విద్యాలయంలోనే చదువుకున్నాను. ఇక్కడి గురువుల విద్యాబోధన, క్రమశిక్షణ నన్ను ఈ రోజు ఈ స్థాయికి ఎదిగేందుకు దోహదపడ్డాయి. ఈ విద్యాలయం ఎంతో మందికి మంచి బంగారు భవిష్యత్తును ఇస్తుంది. అలనాటి నా మిత్రులను కలవడానికి ఇక్కడికి వచ్చాను.

- కల్లిగొట్ల నాగరాజు, డిప్యూటీ కమిషనర్, మేడ్చల్ కమిషనరేట్, హైదరాబాద్

పదేళ్ల తర్వాత కలుసుకున్నాం



మాది నంద్యాల పట్టణం. నేను 1993 నుంచి 2000 వరకు ఇక్కడే చదివాను. పదేళ్ల తర్వాత నేను చదువుకున్న విద్యాలయానికి రావడం, నాతోటి విద్యార్థులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నేను ఇక్కడికి వచ్చేందుకు దాదాపు రూ.2 లక్షలు ఖర్చు అవుతోంది. అయినా వచ్చాను. నా చిన్నతనంలో ఇక్కడ మేము నాటక ప్రదర్శించడం ఎప్పటికీ మరచిపోలేను. ఇక్కడ ఉన్న సగం చెట్లలో మేము పెంచినవే.

-అమర్‌నాథ్, సీనియర్ బిజినెస్ మ్యాన్ (ఖతార్, సౌదీ అరేబియా)





టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

మద్దికెర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాలకు చెందిన టీడీపీ వర్గీయుల మధ్య ఆదివారం ఉదయం ఘర్షణ జరగడంతో ఇరువర్గాలు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న మండలంలోని బసినేపల్లి గ్రామంలో నీటి సంఘం ఎన్నికల్లో మాజీ ఉప సర్పంచ్ తిమ్మప్ప వర్గానికి చెందిన నారాయణను చైర్మన్‌గా ఎన్నుకోవాలని పట్టుబట్టారు. అయితే.. అధిష్టానం మునిరంగడుకు బాధ్యతలను అప్పగించింది. దీనికి పెరవలి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరినే కారణమని భావించిన తిమ్మప్ప మాజీ జడ్పీటీసీ పురుషోత్తం చౌదరిని దుర్భాషలాడాడని ఆయన వర్గానికి చెందిన కొంత మంది తిమ్మప్పను ప్రశ్నించడానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం, దాడి జరిగాయి. ఇరు వర్గాల వారు అవతలి వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన టీడీపీలో కుమ్ములాటలను సూచిస్తోంది. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

జాతీయ రహదారిపై కారు, లారీ ఢీ

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

పాణ్యం, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మరాజుపల్లె సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం కర్నూలు నుంచి నంద్యాల వైపుకు వెళ్తున్న కారును వెనుక వైపు నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతినింది. కారులో ప్రయాణిస్తున్న వారు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. రెండు రోజులుగా రోడ్డు మరమ్మతుల కారణంగా వన్‌వే ఏర్పాటు చేయడంతో వాహనాల రద్దీ, వేగం వంటి సమస్యలతో ప్రమాదాలు జరుగుతున్నాయని పాణ్యం పోలీసులు తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త


హత్యకు గురైన హినాబీ

నందికొట్కూరురూరల్ డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిదిలో గల దామగట్ల గ్రామంలో ఓ భర్త భార్యను హత్య చేశాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. దామగట్ల గ్రామానికి చెందిన రహంతుల్లా తన భార్య హినాబీ (22)ని శనివారం రాత్రి గొంతు నులిమి హత్య హత్య చేశాడు. ఓర్వకల్లు మండలం తిప్పాయ పల్లె గ్రామానికి చెందిన హినాబీకి, రహంతుల్లకు 2021 మే నెలలో వివాహమైంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతుండేదని హినాబీ తల్లి పర్వీన్ తెలిపారు. రహంతుల్లాకు ఓర్వకల్లు పోలీసు స్టేషన్లో కౌన్సిలింగ్ కూడా ఇచ్చారని ఆమె తెలిపారు. అయినా రహంతుల్లా భార్యను హింస్తూ వుండేవాడని, అందులో భాగంగానే గత రాత్రి గొంతు నులిమి చంపేశాడని ఆమె తెలిపారు. పర్వీన్ ఫిర్యాదు మేరకు రహంతుల్లా, అత్త నజీమున్నిలపై కేసు నమోదు చేసినట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై తిరుపాలు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. నిందితుడు పోలీసుల అదుపులో వున్నట్లు సమాచారం.

ధ్యానం, జ్ఞానంతో ఉత్తమ జీవనం

రుద్ర ప్రయాగ పీఠాధిపతి సంత్ సదానందగిరి మహారాజ్


రుద్ర ప్రయాగ పీఠాధిపతి సంత్ సదానందగిరి మహారాజ్‌ను సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్, గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, బీవీ రెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ధ్యానం, జ్ఞానంతోనే మానవ జీవన విధానంలో మార్పు తెస్తుందని రుద్ర ప్రయాగ పీఠాధిపతి సంత్ సదానందగిరి మహారాజ్ ఉద్బోధించారు. ఆదివారం రాత్రి నగరంలోని రాఘవేంద్రనగర్‌లోగల పిరమిడ్ ధ్యాన కేంద్రంలో 'పౌర్ణమి ధ్యానం - ఆత్మజ్ఞానం' అనే అంశంపై ధార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా హాజరైన పీఠాధిపతి సదానందగిరి మహారాజ్ మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ ద్వారా ధ్యానం ప్రపంచానికి పరిచయం అయిందన్నారు. గురువుల ద్వారా పొందిన జ్ఞానాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ దేశపర్యటన చేస్తున్నామని అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ పిరమిడ్ ధ్యాన కేంద్రాల ద్వారా బీవీ రెడ్డి ప్రపంచ వ్యాప్తంగా ధ్యానం ఆవశ్యకతను తెలియజేస్తున్నారని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ ధ్యానంతో ఆరోగ్యవంతులుగా జీవించాలని సూచించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ధ్యానం బ్రహ్మర్షి పత్రీజీ ద్వారా కర్నూలుకు పరిచయం అయితే, బీవీ రెడ్డి దాన్ని కొనసాగిస్తూ సేవలు అందిస్తున్నారని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పిరమిడ్ ధ్యాన కేంద్రం వ్యవస్థాపకుడు బీవీ రెడ్డి మాట్లాడుతూ సుమారు 30 ఏళ్లనుంచి ఆధ్యాత్మిక రంగంలో ఉన్నానన్నారు. పత్రీజీ ద్వారా ప్రపంచానికి ధాన్య కేంద్రాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌ఛార్జి గౌరు వెంకటరెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య హాజరయ్యారు.

దుకాణాల్లో చోరీ

కోడుమూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు పట్టణంలోని మూడు దుకాణాల్లో చోరీ జరిగింది. స్థానిక కర్నూలు రహదారిలో శివసాయి ట్రాక్టర్ స్పేర్స్ దుకాణం నిర్వాహకుడు సురేష్ శనివారం రాత్రి దుకాణం కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం దుకాణం తాళాలు పగలగొట్టి ఉండడం గమనించిన కొందరు యజమానికి ఫోన్ చేసి విషయం తెలిపారు. దీంతో చేరుకున్న బాధితుడు దుకాణంలో పరిశీలించారు. దుకాణంలో ఉంచిన నగదు రూ.25 వేలు దోచుకెళ్లారని గుర్తించి లబోదిబోమన్నాడు. అలాగే టీ దుకాణంలో సుమారు రూ. వెయ్యి విలువ చేసే సిగరెట్లు ప్యాకెట్లు దుండగులు ఎత్తుకెళ్లారు. ఇంకో దుకాణంలో చొరబడి ఏమి దొరక్కపోవడంతో వదిలేసి వెళ్లారు. చోరీ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తైక్వాండోలో బంగారు పతకం


చిన్నారి శ్రీలత

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన నాగమల్లి, నరేంద్రబాబు దంపతుల కుమార్తె గువ్వల శ్రీలత తైక్వాండో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. మొదటి తరగతి నుంచి తైక్వాండో కోచ్ వెంకటేశ్వర్లు శిక్షణలో రాణించింది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది. 2023 సంవత్సరంలో రైల్వేకోడూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ పతకం సాధించింది. 2024లో జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో అనేక సార్లు బంగారు పతకం కైవసరం చేసుకుంది. ప్రస్తుతం సిరాక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుకుంటోంది. తల్లిదండ్రులు, అన్న, కోచ్ ప్రోత్సాహంతో జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతం సాధిస్తానంటోంది.

ఐక్యరాజ్యసమితి శాంతి దళానికి ఆర్మీ యువకుడు


జవాన్ బాషా

రుద్రవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన బాషా ఇండియన్ ఆర్మీ మెడికల్ విభాగంలో పనిచేస్తూ ప్రపంచ ఐక్యరాజ్యసమితి శాంతి దళానికి ఎంపికైనట్లు ఆదివారం ఆయన తండ్రి సయ్యద్ హుసేన్ తెలిపారు. ఇండియా నుంచి లెబనాన్ దేశంలో ప్రపంచ ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో మెడికల్ విభాగంలో పని చేయడానికి ఎంపిక కావడంతో తండ్రి హర్షం వ్యక్తం చేశారు. ఇండియా నుంచి ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో పని చేయడానికి వెళ్లడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

హరిహర క్షేత్రాన్ని దర్శించిన కలెక్టర్

కర్నూలు కల్చరల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రాన్ని కలెక్టర్ పి. రంజిత్ బాషా, నగర పాలక సంస్థ కమిషనర్ బి. రవీంద్రబాబు ఆదివారం సందర్శించారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి స్వామి, అమ్మవార్లతో పూజలు చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్, కమిషనర్ల దృష్టికి హరిహర క్షేత్రం అభివృద్ధికి సంబంధించిన అంశాలను బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ తీసుకెళ్లారు. వారు సానుకూలంగా స్పందించి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు సందేల్ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు టీవీ రవిచంద్రశర్మ, ఆలయ మేనేజర్ ఆకెళ్ల రాధాకృష్ణ, అర్చకులు ప్రసన్న స్వామి, మహేష్ స్వామి, గురురాజ్ పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలి


ఆక్రమణలను తొలగించాలని చెబుతున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని రహదారులపై ఆక్రమణలను తొలగించాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. ఆదివారం రైల్వేస్టేషన్ కూడలి, సంకల్ బాగ్, అశోక్‌నగర్, నరసింహారెడ్డినగర్ తదితర ప్రాంతాలలో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. అలాగే సంకల్‌బాగ్ వద్ద పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్ వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న అనధికార దుకాణాలు, ఆక్రమణలను కమిషనర్ గమనించారు. వాటిని తక్షణమే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాణిజ్య దుకాణాల వద్ద యజమానులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మురుగు కాలువల్లో దుకాణాల చెత్తా చెదారం వేయరాదని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చంద్రరాజేశ్వరావు భవన్‌లో జరిగిన ఏఐవైఎఫ్ నగర మహా సభ నగర అధ్యక్షుడు బాబయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తోందన్నారు. అనంతరం నగర అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా రవి, వీరయ్య, అశోక్, కళాధర్, కార్యదర్శి బీసన్న, సహాయ కార్యదర్శులు చంటి, రాజశేఖర్, బాబయ్య, శ్రీకాంత్, అఖిల్‌తోపాటు 31 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి కారుమంచి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓపెన్ డ్రింక్ కేసులు నమోదు

కర్నూలు క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బిర్లా జంక్షన్ వద్ద చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ట్రాఫిక్ పోలీసులు, త్రీటౌన్ పోలీసులు సంయుక్తంగా డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేశారు. బిర్లా జంక్షన్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. తనిఖీల్లో ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, త్రీటౌన్ ఎస్ఐ మన్మథవిజయ్, ట్రాఫిక్ ఎస్ఐ రెహిమాన్, ట్రాఫిక్ ఆర్ఎస్ హుశేన్ ఉన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ఎక్కడైనా కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే అర్జీ ఇవ్వాలని ఆయన కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర పాలక కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కార్మికులకు వస్త్రాల అందజేత

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రైవేటు ఆసుపత్రుల వ్యర్థాలను సేకరించి డంప్ యార్డుకు తరలించే నగర పాలక డ్రైవర్లు, లోడర్లు, ఇతర సిబ్బందికి నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు చేత ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యులు రెండు జతల చొప్పున యూనిఫాం వస్త్రాలను పంపిణీ చేశారు. ఆదివారం పార్థసారది నగర్‌లోని ఐఎంఏ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు స్వచ్ఛందంగా వాహనాలు, సిబ్బందిని ఏర్పాటు చేసి వాటి ఖర్చును భరించడంతోపాటు సిబ్బంది అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మెడికల్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కమిషనర్‌తో పాటు ఆరోగ్యాధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి తమకు ఎటువంటి సమస్యలు లేకుండా వ్యర్థాల తరలింపునకు పూర్తిగా సహకరిస్తున్నారనీ అన్నారు. అనంతరం ఐఎంఏ సభ్యులు కమిషనర్, ఆరోగ్యాధికారిని సత్కరించారు. కార్యక్రమంలో డా.రామ్మోహన్‌రెడ్డి, డా.రామచంద్ర నాయుడు, డా. శివశంకర్ రెడ్డి, డా.భానుమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సెపక్‌తక్రా సర్వసభ్య సమావేశం, ఎన్నికలు ఆదివారం భారత రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో మన రాష్ట్రం నుంచి జి.శ్రీనివాసులు అఖిల భారత సెపక్‌తక్రా సంఘం ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నూతనంగా ఎన్నికైన కమిటీ నాలుగు సంవత్సరాల పాటు కొనసాగుతుంది.


సెపక్‌తక్రా సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జి.శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం


పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జనసైనికులు

మహనీయుల బాటలో నడుద్దాం

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు




పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ హుశేన్‌పీరా

కర్నూలు కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహనీయుల బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆత్మార్పణం చేసుకున్న అమరజీవి పొట్టి శ్రీరాములు, భారత తొలి హోంశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు, వల్లభ్ భాయ్ పటేల్ చిత్ర పటాలకు పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు చేసిన త్యాగాలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్ పద్మావతమ్మ, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు ఈశ్వరమ్మలతోపాటు గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: రాష్ట్ర ఐక్యత కోసం త్యాగం ఒకరు, దేశ ఐక్యత కోసం మరొకరు కృషి చేసిన మహనీయుల త్యాగఫలాలు ఆదర్శమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి, సర్దార్ వల్ల భాయ్ పటేల్ 74వ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు రాష్ట్ర సాధన కోసం 58 రోజులు అమరణ నిరాహార దీక్ష చేసని ప్రాణాలు అర్పించి అమరజీవి అయ్యారని అన్నారు. భారత దేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడిగా నెహ్రూ మంత్రి వర్గంలో హోంశాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా పదవులు నిర్వహించారని తెలిపారు. స్వాతంత్ర్య అనంతరం దేశంలో విలీనం కావడానికి నిరాకరించిన హైదరాబాద్, జునాగఢ్ లాంటి సంస్థానాధీశులను సైనిక చర్యతో మట్టి కరిపించి దేశంలో విలీనం చేసని ఘనత పటేల్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో షేక్ ఖాజా హుస్సేన్, ఎన్‌సీ బజారన్న, సత్యనారాయణ గుప్త, మల్లేశ్వరీ, శ్రీలత, సత్యరాజు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బీ క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, నైస్ కంప్యూటర్ అధినేత డా.రాయపాటి శ్రీనివాసులు, సీనియర్ అధ్యాపకులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మార్పణ చేసుకుని అమరజీవిగా పేరొందిన మహనీయుడు అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ప్రసన్నకుమార్, రామకృష్ణ, సోమేష్, లక్ష్మి, మల్లేశ్వరుడు, ఉల్లోజిరావు, స్వప్న, బాలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజరు చిన్న రాముడు, అకౌంట్స్ ఆఫీసర్ చుండీప్రసాద్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, కమిషనర్ సీసీ రవికుమార్, ఆర్ఐలు శేషాద్రి, రాజు, సిబ్బంది శివశంకర్, వినోద్‌కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు నాగరాజు, సి.మురళీమోహన్‌రెడ్డి, జితేంద్ర, నాగేంద్రప్రసాద్, రాముడు, శ్రీధర్‌రెడ్డి, ఫణీంద్ర పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం మరువలేమని సర్పంచ్ భాగ్యరత్నమ్మ కొనియాడారు. ఆదివారం కోడుమూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు అలంకరించారు. సర్పంచ్ మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడై ఉద్యోగానికి రాజీనామా చేశారని అన్నారు. సుమారు 58 రోజులపాటు ఆమరణ దీక్ష చేసి తెలుగుబాషా ప్రయుక్త రాష్ట్రం సాధించారని తెలిపారు. అలాగే ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆంధ్రయ్య, సీపీఐ క్రిష్ణ, రాజు టీడీపీ లక్ష్మయ్యశెట్టి పంచాయితీ కార్యదర్శులు శ్రీకాంత్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో, మండలంలోని హుశేనాపురం, ఓర్వకల్లు, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్ద స్వామి, ఉప సర్పంచ్ సమీనా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు, రాజ్‌విహార్ సర్కిల్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని జనసేన పార్టీ రాష్ట్ర జోనల్ కన్వీనర్ పవన్‌కుమార్ కొనియాడారు. ఆదివారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల సేవలు స్ఫూర్తిదాయకమని, వారి ఆలోచనలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రతినిధులు చంద్రమౌళి, సాయి, సుజాత, రాజేష్, పరమేష్, రమేష్ పాల్గొన్నారు.

కర్నూలు క్రైం: ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణం చేసుకున్న అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని అడిషినల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్


జడ్పీలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఈఓ, అధికారులు


హుశేనాపురం సచివాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి


కోడుమూరులో ..

కోల్స్ చర్చిలో నేడు క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం 7 గంటలకు క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ ఏర్పాటు చేసినట్లు చర్చి సంఘ కాపరులు రెవ. ఎస్‌జే జీవన్‌రావు, రెవ. ఆర్ అనిల్ సామ్యేల్, రెవ. ఆర్ పాస్కల్ ప్రకాశ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వాక్యోపదేశకులుగా నెల్లూరు ఎక్లెసియా బాప్టిస్టు ఫెలోషిప్ ప్రతినిధి రెవ. గ్లాడ్సన్ రామపోగు హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ క్యాండిల్ లైటింగ్ ఆరాధనలో క్రైస్తవ భక్తులు పాల్గొని దేవుని ఆశీర్వాదాలు పొందాలని వారు కోరారు.

పౌరాణిక నాటకాలకు ప్రోత్సాహకాలు

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య


టీజీవీ కళాక్షేత్రం తరపున రూ.10 వేలు అందిస్తున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేతంలో ప్రదర్శించే పౌరాణిక నాటక ప్రదర్శనలకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం రాత్రి నగరంలో సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలు కు చెందిన కళావాహిని సాంస్కృతిక, సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర, చింతామణి పౌరాణిక నాటకాల్లోని వివిధ సన్నివేశాలను కళాకారులు ప్రదర్శించారు. కళావాహిని అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు దర్శకత్వంలో జరిగిన ఈ నాటకాలు ప్రేక్షకులను అలరింపజేశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కళాకారుల అభినందన సమావేశంలో పత్తి ఓబులయ్య కళాక్షేత్రం పక్షాన రూ.10 వేలు విరాళం మనోహర్ బాబుకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం గౌరవ చైర్మన్ టీజీ వెంకటేశ్ కళాప్రదర్శనలకు ప్రోత్సాహం ఇచ్చే విధంగా పూర్తి పౌరాణిక నాటక ప్రదర్శనకు రూ.30 వేలు, నాటకంలోని వివిధ అంకాలు ప్రదర్శిస్తే రూ.15 వేలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ప్రతినెలా ఆదివారం తప్పనిసరిగా నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో లలిత కళా సమితి మాజీ అధ్యక్షుడు పి.దస్తగిరి, కళాకారులు జీవీ శ్రీనివాసరెడ్డి, కదిరి రమేష్, నాటకంలోని కళాకారులు శ్రీధర్, నెల్లూరు కృష్ణకుమార్, గుంటూరు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావును సత్కరించారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


కలశ స్థాపనకు విగ్రహాల తరలింపు

కోడుమూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన వల్లెలాంబ దేవి ఆలయ ప్రాంగణంలో మహాయోగి పక్కీరప్ప తాత 2వ ఆరాధన పురస్కరించుకుని ఆదివారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, కలశ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. వేడుక సందర్భంగా మూడు రోజులుగా వేద పండితులు అభిషేకం, హోమం, విగ్రహ పూజలు నిర్వహించారు. వేదపారాయణ పఠించారు. ఆలయ చైర్మన్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో విగ్రహాలు, కలశం ప్రతిష్ఠ జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి భక్తబృందం ఆధ్వర్యంలో భజనలు చేపట్టారు. విగ్రహ ప్రతిష్ఠోత్సవ వేడుకలో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో హోమం

కార్మికుల అభ్యున్నతికే సీపీఐ పోరాటాలు


కమ్యూనిజం పుస్తకం విడుదల చేస్తున్న ఎస్ఐ

కోడుమూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేద, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు చేస్తున్న సీపీఐ సేవలు వెలలేనివని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్ణ అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో క్రిష్ణ మాట్లాడుతూ డిసెంబరు 26కు సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతుందని అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం సీపీఐ పోరాటం సాగించిందని గుర్తు చేశారు. అనంతరం పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ శ్రీనివాసులు, సీపీఐ నాయకులు కమ్యూనిజం పుస్తకాలు విడుదల చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

ఓర్వకల్లు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం మండల మూడో మహా సభ జరిగింది. ఈ సమావేశానికి శ్రీధర్, చంద్రబాబు నాయుడు అధ్యక్షత వహించారు. గౌస్ దేశాయ్‌తోపాటు కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, మండల కార్యదర్శి నాగన్న హాజరయ్యారు. అంతకుముందు సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ పాలన రాజ్యాంగ విరుద్ధంగా సాగుతోందన్నారు. రైతులు, కార్మికులు, ప్రజలపైన విపరీతమైన భారాలు మోపుతూ ప్రజల నడ్డిని విరుస్తోందని విమర్శించారు. పరిశ్రమల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకటస్వామి, మధుసూ దన్, చాంద్‌బాషా, సుధాకర్, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

సి. బెళగల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాధికారి ఆదాంబాషా అన్నారు. ఆదివారం ఎస్సీ, బీసీ హాస్టల్‌లో చదువుతున్న 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేస్తానని చెప్పారు. పబ్లిక్ పరీక్షలంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రతి విద్యార్థి రోజూ చదవడం, రాయడం చేస్తే ఉత్తీర్ణులవుతారని తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ


మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ కలుగుతుందని 4వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఊట్ల రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక పాత బస్టాండులోని కొండారెడ్డి బురుజు సమీపంలోని కేఎంసీ పార్కులో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులను ఆయన సందర్శించి పౌష్టికాహారం అందజేశారు. ఆత్మరక్షణకు తైక్వాండో లాంటి మార్షల్ ఆర్ట్స్ అవసరమన్నారు. మహిళలు తప్పకుండా శిక్షణ తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు తైక్వాండో క్రీడాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో కోచ్ వెంకటేశ్వర్లు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల మధ్య సెమీ క్రిస్మస్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఎవెంజెలికల్ సపోర్టింగ్ టీం సభ్యులు ఆదివారం డాన్‌బోస్కో హోం, అనాథ చిన్న పిల్లల మధ్య క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీసు నిర్వహించారు. వీరికి క్రీస్తు జన్మం గురించి కమిటీ చైర్మన్ బి.జయాకర్ వివరించారు. వీరికి కేకులు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సురేష్, సుధీర్, భాను, రమేష్, రాజు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న వెల్లాల లలితమ్మ

ఆదోని టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెరాక ప్రార్థన మందిరంలో ఆదివారం పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ మాట్లాడుతూ అందరూ కలిసి పండుగలు చేసుకునే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం మాత్రమే అన్నారు. పాస్టర్ ప్రభాకర రావు, శాంతమ్మ, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యాక్షులు భాష, పండితుడు వెల్లాల మధుసూదన్ శర్మ, శ్రీరాములు, మధు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కార్మికులు నిరసన తెలిపారు. మెడికల్ అలవెన్స్ రూ.6వేలు ఇస్తానని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిదన్నారు. పనిముట్లు, యూనిఫామ్, వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. ఈనెల 19న విజయవాడలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాగరాజు, వెంకన్న, భీమేష్ పాల్గొన్నారు.

పౌర్ణమి పూజలు

ఆదోని టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగా భవాని ఆలయంలో ఆదివారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఉదయం పుష్పార్చన, కుంకుమార్చన, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తిని పల్లకిలో ఉంచి ఊరేగించారు. గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, ఆటో వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, వీరేష్, దుల్లయ్య, వీరేష్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

మీనాక్షి నాయుడుకు సన్మానం



మీనాక్షి నాయుడిని సన్మానిస్తున్న అధ్యక్షులు, ఉపాధ్యక్షులు

ఆదోని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తరఫున పోటీ చేసి గెలుపొందిన సాగునీటి సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్, టీసీలు ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడును సన్మానించారు. ఆదివారం స్వగృహంలో ఆయన కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. మీనాక్షి నాయుడు మాటాడుతూ ఆదోని నియోజకవర్గంలో ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు టీడీపీనే గెలిపిస్తారని, విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంతేకుడ్లూరు, దానాపురం, నాగనాథనహళ్ళి, ఇస్వి గ్రామాల విజేతలకు మీనాక్షి నాయుడు సన్మానించారు.

జన సైనికుడి కుటుంబానికి సాయం

ఆస్పరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పాణ్యంలో సెంట్రింగ్ పనికి వెళ్లి మృతిచెందిన మునిస్వామి కుటుంబానికి జనసేన నాయకులు రూ.30 వేలు అందజేశారు. ఆలూరు ఇన్‌చార్జి వెంకటప్ప సూచన మేరకు మండలంలోని తంగరడోన గ్రామంలో కన్వీనర్ అరవిందు, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ ఆదివారం అందజేశారు. శివ, హనుమేష్, ప్రసాద్, వీరేష్, మహేష్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న నాయకులు

అధ్యక్ష పదవి రేసులో కిష్టప్ప?



ఆలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 6 సాగు నీటి సంఘాల అధ్యక్ష పదవులకు పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఇక ఆలూరు బ్రాంచ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ ఉంది. హత్తిబెళగల్ సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నగరడోణ కిష్టప్ప పేరును టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం మిగిలిన చింత కుంట, చిప్పగిరి, దేగులపాడు, అర్థగేరి, రామదుర్గం అధ్యక్షులతో మాట్లాడి, ఈనెల 17న కర్నూలులో నిర్వహించనున్న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికల్లో డీసీ అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. ఈ విషయంలో ఇప్పటికే చర్యలు జరుగుతున్నట్లు సమాచారం. కాగా నగరడోణ కిష్టప్ప పేరు దాదాపు ఖరారు అయినట్లు సమాచారం.

'సభ్యత్వంతో కుటుంబానికి భరోసా'



ఉప్పర్లపల్లిలో టీడీపీ సభ్యత్వం చేస్తున్న నాయకులు

తుగ్గలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఉంటుందనిఆ పార్టీ నాయకుడు అప్పా వేణు గోపాల్ అన్నారు. ఆదివారం ఉప్పర్లపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా వస్తుందన్నారు. మనోహర్, అప్పా జగన్మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వనాథ్, నాగార్జున తదితరులు ఉన్నారు.

దత్తాత్రేయ జయంతి

ఆలూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ జయంతి నిర్వహించారు. ఉదయం పంచామృతశేకం, కుంకుమ అర్చన, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను అర్చకులు యుగంధర్ స్వామి ఆధ్వర్యంలో చేశారు.

ముంచిన కంది



మద్దికెరలో కల్లంలో నిల్వ ఉన్న కందులు

- మద్దికెర మండలంలో మంచి దిగుబడి.. అయినా కొనని ప్రభుత్వం
- ఆస్పరి మండలంలో దిగుబడి రాక రైతుల నిరాశ

మద్దికెర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి. ఇక్కడంతా వర్షాధార పంటలే ఆధారం. 15వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. దిగుబడి కూడా బాగా రావడంతో రైతులు సంతోషపడ్డారు.

ప్రతిపాదనలు రాక నిరాశ...

కందులను కొంటామన్న ప్రభుత్వం ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో రైతలు నిరాశ చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడ్డాని, తీరా అమ్ముకోడానికి లేదని ఆందోళన చెందుతున్నారు. కందులను ప్రభుత్వం రూ.7,500ల ప్రకారం కొనుగోలు చేస్తారన వ్యవసాయ సిబ్బంది చెప్పారు. అయితే ఎప్పుడు కొంటారో తెలియడం లేదు. దిగుబడులు నిల్వ ఉంచుకునేందుకు ప్రభుత్వ గోదాములు లేకపోవడంతో ఎంతో కొంతకు ప్రైవేటు వ్యాపారులుకు అమ్ముకోడానికి సిద్ధపడుతున్నారు.

తరుగు పేరుతో వ్యాపారుల దోపిడీ..

రైతుల అవసరాన్ని అవకాశంగా తీసుకున్న వ్యాపారులు క్వింటానికి 5 నుంచి 6 కిలోల వరకు తరుగు తీసుకుంటున్నారు. దీంతో రైతులు మోసపోతున్నారు. దీంతో క్వింటానికి 106 నుంచి 108 కేజీల వరకు పోతుండటంతో నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. వ్యాపారులను ప్రశ్నిస్తే కంది విత్తనాలు త్వరగా ఆరిపోవని, దుమ్ము ఉందని చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక నిరాశ చెందడం తప్పడం లేదు ఈ విషయమై ఏవోను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపామని ఆదేశాలు అందిన వెంటనే కొంటామమన్నారు.

తరుగు పేరుతో దోచుకుంటున్నారు.



వ్యాపారులు తరుగు పేరుతో దోచుకుంటున్నారు. కొందరు దళారులు దిగుబడులను కొనుగోలు చేసి నగదు ఇవ్వకుండా పరారయ్యారు. ప్రభుత్వం గ్రామాల్లోనే కొనుగోలుకేంద్రాలను ఏర్పాటు చేసి రైతులును ఆదుకోవాలి.

- హనుమన్న, రైతు, మదనంతపురం

దిగుబడి అంతంత మాత్రమే



ఐనేకల్ గ్రామంలో కంది దిగుబడిని గ్రేడింగ్ చేస్తున్న రైతు

ఆస్పరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కంది ఈ ఏడాది నిరాశ పరచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎర్ర నేలలున్న యాటకల్లు, కల్లపరి, బిల్లేకల్, తంగరడోన, తురవగల్, దొడగొండ, బనవనూరు గ్రామాల్లో సుమారు 15వేల ఎకరాల్లో సాగు చేశారు. అయితే

దిగుబడి ఎకరాకు 2 క్వింటాళ్ల నుండి 4 లోపే వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యం, అధిక వర్షాలతో పంట దెబ్బతిందని రైతులు నిరాశ చెందుతున్నారు. కంది సాగు చేయడానికి ఎకరాకు రూ.30వేల వరకు ఖర్చయిందని, ఈ దిగుబడితో పెట్టుబడి కూడా రాదని ఆవేదన చెందుతున్నారు. జూన్‌లో విత్తనం వేయగా, రుతుపవనాల ప్రారంభంలో పంట ఏపుగా పెరిగింది. అయితే ంట పూత దశలో ఉండగా, అక్టోబరులో కురిసిన వర్షాలు పూత పిందె రాలిపోయింది. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా విత్తనాలు వేయాలని ఏవో నరేంద్ర కుమార్ సూచించారు.

ఎకరానికి మూడు క్వింటాళ్లే వచ్చింది.



నాలుగు ఎకరాల్లో కంది సాగు చేశాను. అధిక వర్షాతో పూత దశలో పంట దెబ్బతింది. ఎకరానికి మూడు క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. భవిష్యత్తులో కంది విత్తాలంటే భయమేస్తుంది. **- రాళ్లపెద్ద రంగన్న, రైతు, ఆస్పరి**

పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే ఆంధ్రరాష్ట్రం



ఆదోనిలో నివాళి అర్పిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో నివాళి అర్పిస్తున్న డీఎస్పీ, పోలీసులు

- వర్థంతి సందర్భంగా నివాళి అర్పించిన అధికారులు, నాయకులు

ఆదోని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేశారని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. ఆదివారం కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతి నిర్రవహించారు. ముందుకు చిత్ర పటానికి నివాళి అర్పించారు. మనం ఒకపూట తినకపోతేనే ఇబ్బంది పడతామని, పొట్టి శ్రీరాములు 58రోజులు నిరాహార దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించారన్నారు. సర్వేయర్లు వేణు సూర్య, శ్రీనివాసరాజు, బీటీ వలిభాష, రాఘవేంద్ర, వినీత్, లక్ష్మీజీ, రామచంద్ర, లక్ష్మయ్య, ఖాసిం పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది : డీఎస్పీ

పత్తికొండ/టౌన్: అమరజీవి పొట్టిశ్రీరాములు తాగ్యం మరువలేదని డీఎస్పీ వెంకట్రామయ్య అన్నారు. ఆదివారం పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. టౌన్ సీఐ జయన్న, రూరల్ సీఐ పులిశేఖర్, మైత్రి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ రామ్మోహన్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు..

బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచనపోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందించారు.

ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో..

ఆదోని టౌన్: పట్టణంలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్థంతి నిర్వహించారు. ముందుకు చిత్ర పటానికి నివాళి అర్పించారు. రాష్ట్రావతరణకు యన చేసిన పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం డీఎస్పీ బంగ్లా వద్ద ఉన్న మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆవోపా అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, రఘు, కోశాధికారి వెంకటేశ్వరులు, సభ్యులు రాఘవేంద్ర, కిరణ్, టీజీ మురళి పాల్గొన్నారు.

వెల్దుర్తి టౌన్: పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని వెల్దుర్తి ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీరాములయ్య అన్నారు. ఆదివారం మెయిన్ బజారులో నివాళి అర్పించారు. కిరణ్, ఒంగోలు సాయి, కార్తిక్, మారుతి, శ్రీకాంత్, జ్ఞానేశ్వరయ్య, అభినవ్, శ్రీనివాసులు, కాంతు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎంపీపీ అనితా యాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్థంతి సదర్భంగా ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాల్లో నివాళి అర్పించారు. కార్యదర్శి శివకుమార్, గోవిందురాజులు, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ, సభ్యులు రామాంజులు, బాలచంద్ర తదితరులు ఉన్నారు.

ఆలూరు రూరల్: పొట్టి శ్రీరాములు వర్థంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం అరికేర, మొలగవల్లి, కొట్టాల, ముసనహళ్ళి, పెద్దహోతూరు సచివాలయంలో నివాళి అర్పించారు. కార్యదర్శులు హంల్లెప్ప, జిలన్ బాషా, గర్జప్ప, విష్ణు, డీటీవో సింగ్, టీడీపీ నాయకులు మల్లేశ్, మల్లప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు నీరందించేందుకు కృషి చేయాలి



నూతన అధ్యక్షులను సన్మానిస్తున్న వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాగునీరు అందించేందుకు కృషి చేయాలని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి సూచించారు. సాగు నీటి సంఘాల నూతన అధ్యక్షులను ఆదివారం సన్మానించారు. రైతులకు ఆలూరు బ్రాంచ్ కెనాల్, తుంగ భద్ర ప్రాజెక్టుల ద్వారా, చెరువుల ద్వారా సాగు నీరు అందించేందుకు పని చేయాలన్నారు. ప్రభుత్వం కూడా సాగు నీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

సాగు నీరదించేందుకు కృషి



అధ్యక్షుడు కురువ మల్లన్నను సన్మానిస్తున్న రైతులు

హలహర్వి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లెల్సీ ఆయకట్టు రైతులకు సాగు నీరందించేందుకు కృషి చేస్తానని జెహోసళ్ళి సాగునీటి సంఘం అధ్యక్షుడు కురువ మల్లన్న అన్నారు. ఆదివారం మల్లన్నను రైతులు సన్మానించారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రైతులను విస్మరించిందని. కాల్వలు పూడికతో నిండి పోయాయన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

20 ఏళ్ల తర్వాత కలిశారు



నాటి ఉపాధ్యాయులతో 2003-04 పదో తరగతి పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ ఆంథోనీ పాఠశాల 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నాటి అల్లర్లను, తీపి జ్ఞాపకాలను వెమరు వేసుకున్నారు. స్నేహితులను అలింగనం చేసుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కరస్పాండెంట్ జాన్ డేవిడ్, హెచ్‌ఎం కేశవయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మారెన్న, విశ్రాంత ఉపాధ్యాయులు జ్యోతి రెడ్డి, శాంతాగ్రేష్, థామస్, సామెల్, పూర్వ విద్యార్థులు పాదర్ ప్రకాష్, రామాంజినేయులు, జయరాం, కృష్ణారెడ్డి, సౌజన్య, ఈశ్వరి హుస్సేనమ్మ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అరసం సభ్యులు

పుస్తకావిష్కరణ

పత్తికొండ, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రీడింగ్‌రూంలో ఆదివారం కమలా కళానికేతన్ ఆధ్వర్యంలో సవ్వప్పగారి ఈరన్న రాసిన 'ఆదోని డివిజన్ రచయితలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అరసం జిల్లా ప్రధాన కార్య దర్శి కొత్తపల్లి సత్యనారాయణ ఆవిష్కరించి సమీక్షించారు. తెలుగు భాష పరి రక్షణకు సాహితీప్రియుల కోసం సవ్వప్పగారి ఈరన్న చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయన రాసిన 72వ రచన ఈ పుస్తకమని, వెనుకబడ్డ ప్రాంత మైన ఆదోని డివిజన్‌లో రచయిత లను వెలుగులోకి తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నం అమోఘమని కొనియాడారు. అరసం సభ్యులు పుల్లయ్య, రంగస్థల నటుడు రంగన్న ఉన్నారు.

ప్రత్యేక పూజలు

మద్దికెర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దమ్మ కుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు నిర్వహించారు. మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. అలాగే మద్దికెర గ్రామ దేవత మద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా రథోత్సవం

తుగ్గలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగనాయునిదొడ్డి గ్రామ సమీపంలోని తిమ్మగురుడు, మునిరంగ, శ్రీదేవి భూదేవి రథోత్సవ ఆదివారం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి శ్రీనివాసులు పూజలు చేసి, వేదపండితులచే శ్రీదేవి భూదేవి సమేత మునిరంగడు స్వాములకు మంత్రోచ్ఛరణాల మధ్య కళ్యాణం చేశారు. నిర్వాహకులు కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు తలారీ రాముడు, బి.వెంకట్రాముడు, గుంత దేవేంద్ర, జిన్నామాబు, మోహన్, రామారావు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు

రథోత్సవంలో నిర్వహించిన రాతిదూలం పోటీలు పోటాపోటీగా జరిగాయి. పోటీలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు ప్రారంభించారు. పోటీల్లో దాదాపు 15 జతల ఎడ్లు పాల్గొనగా, ఎడుగురు విజేతలకు రూ.50 వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. తలారి రాముడు, వెంకట్రాముడు, గుంత దేవేంద్ర, మోహన్, జిన్నామాబు, మిద్దె వెంకటేశ్ యాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు, రైతులు పాల్గొన్నారు.




పోటీలను ప్రారంభిస్తున్న తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్



ఆలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజలు, వాహనదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాము. హెల్మెట్ ధరించాలని కళాశాల విద్యార్థులకు సూచిస్తున్నాం.

ప్రశ్న: పేకాట, సారా నియంత్రణ చర్యలు?

జవాబు: మండలంలో పేకాట, అక్రమ మద్యం, సారా తయారీపై నిఘా ఉంచాం.. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

ప్రశ్న: ప్రజలు సైబర్ ఉచ్చులో పడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఇటీవల సైబర్ మోసాలు అధికమయ్యాయి. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, ఓటీపీ అడిగితే చెప్పకూడదు. అజ్ఞాత వ్యక్తులు తరచూ ఫోన్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

ప్రశ్న: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీనిపై చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: పరిమితికి మించి ఎక్కించుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్రశ్న: సమస్యాత్మక గ్రామాల్లో ప్రశాంతతకు మీ చర్యలేమిటి?

జవాబు: సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచి పల్లెబస నిర్వహిస్తున్నాం. ఘర్షణలకు పాల్పడే వారిపై, ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

రమణీయం.. ఆంజనేయ రథోత్సవం

● వేలాదిగా తరలి వచ్చిన భక్తులు



అశేష జనవాహిని మధ్య ఆంజనేయ స్వామి రథోత్సవం

కోసిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోసిగి సజ్జలగుడ్డం గ్రామాల పొలాల్లో వెలసిన మార్లబండ ఆంజనేయస్వామి రథోత్సవ వేడుకలు అశేష భక్త జనవాహిని మధ్య రమణీయంగా సాగాయి. ఆదివారం ఉదయం నుంచి ఆంజనేయ స్వామికి పూజారి శ్రీరాములు, ధర్మకర్తలు విశ్వనాథరెడ్డి, మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆకు పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం స్వామివారికి పూర్ణకుంభాలు, కలశాలతో ఆలయ ధర్మకర్తలు, టీడీపీ యువ నాయకులు ఎస్.రామకృష్ణారెడ్డి, మురళి దొర, ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, పాలకుర్తి దివాకర్ రెడ్డి హాజరై వేర్వేరుగా రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్‌లు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేశ్, ఈరన్న, వీరయ్య, నరసింహులు, గాలెం వీరేష్, సొట్టయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

నందవరం, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): నందవరం మండలంలో గెలుపొందిన డబ్ల్యూఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లు ఆదివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రైస్‌మిల్ నారాయణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ముగతి ఈరన్న గౌడ రజక సంఘం నాయకులు చంద్ర, గోపాల్‌రెడ్డి, కాశీంవలీ, డివి రాముడు, పెద్దరాముడులు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయమని, శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు.

కష్టపడి పని చేసే వారికి గుర్తింపు



రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న
సాగు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు

మంత్రాలయం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ తరఫున కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మాధవరం రాఘవేంద్రరెడ్డి నివాసంలో కోసిగి, కౌతాలం, పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాలకు చెందిన సాగునీటి సంఘాల 21 అధ్యక్ష ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్లతో సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా రాఘవేంద్రరెడ్డికి సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరవ రమాకాంత్‌రెడ్డిలకు శాలువ, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివరాంగౌడు, చంద్ర, ముకురన్న, వరదరాజులు, తెర్నేకల్ రఘు, భీమరాయుడు, తిరుమల్ నాయక్, గోవిందప్ప, నరసింహులు, అంజినేయ, రామలింగప్ప, అనంతసేనారెడ్డి, తమ్మిరెడ్డి, విరుపాక్షి, శివశంకర్, సత్యన్నగౌడు, వెంకన్న, టిప్పుసుల్తాన్, పంపన్నగౌడు, భీమన్న, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

సాగు నీరందించేందుకు కృషి చేస్తాం



మాధవరం ఎల్లెల్సీ సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన
భీమరాయుడును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాధవరం ఎల్లెల్సీ పరిధిలోని ఆయకట్టు రైతులందరికీ సాగు నీరందించేందుకు కృషి చేస్తామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి అన్నారు. ఆదివారం మాధవరం కాలువ సాగునీటి సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన గొర్లె భీమరాయుడును ముత్తురెడ్డి పూలమాల, శాలువతో సన్మానించారు. అనంతరం ముత్తురెడ్డి మాట్లాడుతూ సాగునీటి సంఘం ఎన్నికల్లో కోసిగి మండలంలో అన్ని స్థానాల్లో టీసీ మెంబర్లను టీడీపీ కైవసం చేసుకుందని, మూడు చోట్ల అధ్యక్షులుగా టీడీపీ అభ్యర్థులు ఎన్నికయ్యారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, నాయకులు నరసింహులు, జనార్దన్, హనుమంతు, పెద్ద హుసేనీ, గొర్లె నారాయణ, నరసన్న, వెంకన్న తదితరులున్నారు.

ఉల్లి సాగుపై రైతుల క్షేత్ర ప్రదర్శన



చింతకుంటలో రైతు మున్నయ్య
ఉల్లి పంటను పరిశీలిస్తున్న వివిధ గ్రామాల రైతులు

కోసిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో రైతు మున్నయ్య పండించిన ఉల్లి పంటపై మండలంలోని అన్ని గ్రామాల రైతులు క్షేత్ర ప్రదర్శన చేసి మెలకువలు తెలుసుకున్నారు. ఈషా అగ్రి సీడ్స్ రాయల్ రెడ్ ఉల్లి పంటతో అధిక దిగుబడులు వస్తాయని ఏరియా మేనేజర్ ఎం.బసవరాజు, సేల్స్ ఆఫీసర్ మహేష్‌గౌడు, కోసిగి కిరణ్ హైబ్రిడ్స్ సీడ్స్ మేనేజర్ లింగప్ప తెలిపారు. ఉల్లిగడ్డ సైజు వంద గ్రాముల బరువు ఉండి నాణ్యమైన రంగు కలిగి ఉంటుందన్నారు. దూర ప్రాంత రవాణాకు ఉల్లి అనుకూలంగా ఉండటం వల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు.

మాజీ ఎంపీపీ మృతి

పెద్దకడుబూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ హనుమంతురెడ్డి(85) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు వీరసేనారెడ్డి పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం తొమ్మిది రోజుల దినాన్ని పూర్తి చేశారు. అలాగే మూడు నెలల క్రితమే హనుమంతురెడ్డి సతీమణి గ్యాస్ పేలి మృతి చెందింది. కుమారుడు మృతి చెందిన తొమ్మిదవ రోజే తండ్రి హనుమంతురెడ్డి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సీఐపై చర్యలు తీసుకోవాలి

వైసీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

ఎమ్మిగనూరు/టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిపై దురుసుగా మాట్లాడిన కర్నూలు సీఐ ఇబ్రహీంపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. సాగు నీటి సంఘాల ఎన్నికల సందర్భంగా శనివారం పార్లపల్లిలో పోలింగ్ కేంద్రం దగ్గరకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి అక్కడ బందోబస్తు విధుల్లో ఉన్న సీఐ ఇబ్రహీంల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో వైసీపీ నాయకులు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు జీపును అక్కడే నిలబెట్టడంతో జీపును అక్కడి నుంచి పక్కకు పెట్టాలని, అలాగే మైకులో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్న వైసీపీకి చెందిన ఓ నాయకుడు నుంచి పోలీసులు మైకును స్వాధీనం చేసుకున్నారు. దీంతో పట్టణ ఎస్ఐ నాయక్‌కు, వైసీపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకొని తోపులాట జరిగింది. కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీన్ని గమనించిన వైసీపీ నాయకులు బసిరెడ్డి ఇరువురిని సముదాయించి ఎస్ఐతో మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం రాస్తారోకోలు కొనసాగించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, బీఆర్ బసిరెడ్డిలు మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకొని కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలను ఏకగ్రీవం చేసుకుందని



పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో బైఠాయించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

విమర్శించారు. దమ్ముంటే ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిపి గెలవాలని సవాల్ విసిరారు. పోలింగ్ కేంద్రం దగ్గరకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని ఏకవచనంతో దురుసుగా మాట్లాడిన సీఐ ఇబ్రహీం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని అండగా మేముంటామన్నారు. అనంతరం రూరల్ సీఐ బీవీ మధుసూదన్‌రావును కలిసి సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, కాశిరెడ్డి, కౌన్సిలర్లు రజారత్నం, ఖాశింబేగ్, బజారి, సుధాకర్, శివప్రసాద్, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ యు.కె.రాజు, సునీల్‌కుమార్, నాయకులు లక్ష్మీకాంత రెడ్డి, శివప్పగౌడు, కొటేకల్లు లక్ష్మన్న, కడివెళ్ల రంగస్వామి, పెసలదిన్నె యంకప్ప, దేవేంద్రగౌడు, వెంకటరామిరెడ్డి, విశ్వనాథ్‌రమేష్, అల్తాఫ్, భాస్కర్, గిడ్డయ్య, షరీఫ్, చాంద్‌బాషా, నరసింహులు, మన్సూర్ పాల్గొన్నారు.

బంద్ ఉపసంహరణ



ఎమ్మిగనూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ బంద్‌ను ఉపసంహరించుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘం ఎన్నికల సందర్భంగా పార్లపల్లి సీఐ ఇబ్రహీం తనను దూషించారన్నారు. సీఐ క్షమాపణ చెప్పపోవటంతో సోమవారం నాయకులు, కార్యకర్తలు బంద్‌కు పిలుపునిచ్చారన్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ బిందుమాధవ్ సీఐపై చర్యలు తీసుకుంటామని ఎస్‌బీ సీఐ ద్వారా ఫోన్ చేసి హామీ ఇవ్వడంతో బంద్‌ను ఉపసంహరించుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో బీఆర్ బసిరెడ్డి, నజీర్, యూకే రాజు, బసిరెడ్డి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు



టీడీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి
పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీవీ



తుంగభద్ర నది ఒడ్డున పొట్టి శ్రీరాములు చిత్రపటానికి
పిండ ప్రదానం చేస్తున్న వేణుగోపాల్, ఆర్యవైశ్యులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి కొనియాడారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మహనీయుని సేవలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో తుంగభద్ర నది ఒడ్డున అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని జరుపుకున్నారు. ఆదివారం పొట్టి శ్రీరాముల పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు గుడివాడ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ వెంకటేశ్ శెట్టి, రాఘవేంద్ర, సూర్యనారాయణ, ప్రహ్లాదశెట్టి, నారాయణ శెట్టిలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. చెన్నైకి చెందిన వేణుగోపాల్ అనే వ్యక్తి పొట్టి శ్రీరాములుకు వారసులు లేకపోవడం ద్వారా పిండ ప్రదానానికి హైకోర్టు ద్వారా అనుమతులు పొంది 2017నుంచి మూడేళ్లుగా 58 రోజులు దీక్ష చేపట్టి మరణించిన చోట పిండ ప్రదానాలు చేశారు. 12 జీవన నదులైన గోదావరి, కృష్ణ, తుంగభద్ర నదుల వద్ద పిండ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు లక్ష్మయ్య శెట్టి, గురురాజ్ శెట్టి, శశికాంత్, బసవరాజు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



భద్రకాళిదేవి

గోనెగండ్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో ఆదివారం భద్రకాళిదేవి, వినాయక స్వామి, నందీశ్వరస్వామి, విగ్రహాలు, ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. షాపూర్ జగద్గురు గిరిమల్లేశ్వర వివాచార్య మహా స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భద్రకాళిమాత, వినాయస్వామి, నందీశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, కూష్మాండబలిదానం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అలాగే గోనెగండ్లలోని సూర్యవంకలో వినాయక ఆలయంలో కలశ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమాలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఘనంగా చింతలాముని స్వామి జయంతి



స్వామివారికి పల్లకి సేవ

గోనెగండ్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన చింతలాముని స్వామి జయంతిని ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 5 గంటలకు స్వామివారి మూల విరాట్‌కు జలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్ర సాదాలు అందజేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే గాక కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, రాయచూర్, గద్వాల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం



చెన్న బసప్పను సన్మానిస్తున్న దృశ్యం

కౌతాళం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్న బసప్పను కౌతాళం-1 సాగునీటి సంఘం అధ్యక్షుడు డింగి రఘురాము ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా డింగి రఘురాము మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన చెన్నబసప్ప, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజబాబు, సిద్ధు, మంజునాథ్ ఉన్నారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి



కౌతాళం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బదినేహాల్ సర్పంచ్ మాల నరసప్ప(61) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సర్పంచ్ మాల నరసప్ప కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన గతేడాది ఆగస్టు 19, 2023లో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసి గెలుపొందాడు. అంతకు ముందు గ్రామ సర్పంచ్‌గా ఉన్న మాల రామప్ప అక్టోబరు9, 2022లో మృతి చెందగా, ఉప ఎన్నికలు జరిగాయి. పదవి కాలం పూర్తి కాకుండానే ఇద్దరు సర్పంచులు మృతి చెందడం శోచనీయం. గ్రామ పెద్దలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళ ప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. దీంతో మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్‌లు పరిమళ ప్రసాదం కొరత రానీయకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు పండితుల ఆశీస్సులు పొందారు.



శ్రీమఠం మధ్వమార్గ్ కారిడార్‌లో రద్దీగా ఉన్న భక్తులు

వెండి గజ వాహనంపై ప్రహ్లాదరాయలు

రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో తెల్లవారు జాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెండి గజ వాహనంపై స్వామివారు ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకొని ప్రవచనా మండపంలో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి పూర్వ పీఠాధిపతి సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు. ఆదివారం చిత్తూరులోని సుజ్ఞానేంద్రతీర్థుల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుజ్ఞానేంద్రతీర్థుల జీవిత చరిత్రను ప్రవచనాల ద్వారా భక్తులకు సందేశం ఇచ్చారు. పీఠాధిపతి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి, పవనాచార్, నర సింహ దేశాయ్, తంది స్వామి, వరదేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గాంధీ విగ్రహం ఎదుట మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఆదివారం పందకొండవ రోజు సమ్మె కొనసాగించారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ముందుగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. వీరి సమ్మెతో పట్టణంలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. కొన్ని కాలనీల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. కార్యక్రమంలో విజయ్‌కుమార్, శ్రీరాములు, బాలాజి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిపై దురుసుగా ప్రవర్తించి చెయ్యి చేసుకున్న ఎంఈవో మధుసూదన్ రావుపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కీర్తన అనే విద్యార్థిపై విచక్షణరహితంగా కొట్టడం హేయమైన చర్య అని అన్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆదర్శంగా నిలవాల్సిన విద్యాశాఖ అధికారులే దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని , లేకపోతే బాధిత విద్యార్థినితో కలిసి డీఈవో ఆఫీస్‌ను ముట్టడిస్తామన్నారు.

పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మెరుగైన పీఆర్సీ ఇస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. 12వ పీఆర్సీ అమలు చేయాల్సిన గడువు పూర్తయి 18 నెలలు అలస్యమైందని వెంటనే 30శాతం మధ్యాంతర భృతి ప్రకటించి పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తొమ్మిది నెలల నుంచి పీఎఫ్ లోన్స్, 32 నెలల నుంచి సరెండర్ లీవ్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటితో పాటు డీఏ బకాయిలు కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసన్న రాజు, బసవరాజు, ఉరుకుందాచారి, రంగన్న, నాగరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

నందవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను ఆదివారం తహసీల్దార్ శ్రీనివాసులు సీజ్ చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు నాగలదిన్నె రోడ్డు వద్ద కాపుకాచి ఐదు ట్రాక్టర్లను సీజ్ చేశారు. సేఫ్ కస్టడీ కోసం ఎస్‌హెచ్‌వో అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

అనుమతులు లేని పది వాహనాలు కూడా..

మంత్రాలయం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతులు లేకుండా ఆంధ్రలోకి ప్రవేశించిన పది వాహనాలను సీజ్ చేసినట్లు ఆదోని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేఎండీ ఆవాజ్ తెలిపారు. లైసెన్సు, ఇన్సూరెన్స్, పర్మిట్లు లేని పది వాహనాలను మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ పరమేష్ నాయక్, సిబ్బంది రామకృష్ణ, అంజనేయులు, జమీర్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

నందవరం, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె దగ్గర అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఎస్ఐ శ్రీనివాసులు ఆదివారం పట్టుకున్నారు. కర్ణాటక ప్రాంతం నుంచి కనకవీడు గ్రామానికి చెందిన లక్ష్మీకాంతరెడ్డి నాగలదిన్నె మీదగా మద్యాన్ని తీసుకవస్తుండగా నాగలదిన్నె దగ్గర పోలీసులు పట్టుకున్నారు. ఆయన దగ్గర నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.